
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జనగామ
శుక్రవారం 2 ఆగస్టు 2024

కోచ్ తూచ్!



- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు
- 1982, 2004లో మంజూరైనా.. ఇతర రాష్ట్రాలకు తరలింపు
- చివరకు వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు
- రైల్వే డివిజన్ విషయంలోనూ పేచీలే
- అన్ని అర్హతలున్నా డివిజన్‌కు నోచుకోని కాజీపేట రైల్వే జంక్షన్
- కోచ్ ఫ్యాక్టరీ వస్తే 60వేల మందికి ఉపాధి.. వ్యాగన్‌తో అయితే 2వేల మందికే..
- దక్షిణ మధ్య రైల్వేకు గేట్‌వేగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం

'రాష్ట్ర విభజన' హామీని విస్మరించిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మారుతున్నాయి. 55ఏళ్లుగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. 2014లో ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీ హామీపై కూడా కేంద్ర ప్రభుత్వం 'తూచ్' అన్నట్టుగానే వ్యవహరిస్తోంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. వేలాది మందికి ఉపాధిని కల్పించే కోచ్ ఫ్యాక్టరీని కాదని, వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయటంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో 'వ్యాగన్ వద్దు.. కోచ్ ఫ్యాక్టరీ ముద్దు' అంటూ ఓరుగల్లువాసులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పట్టాలెక్కటం లేదు.

కాజీపేట చేజారిన కోచ్ ఫ్యాక్టరీ..

కాజీపేట రైల్వే స్టేషన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి వారిధిగా నిజాం కాలంలోనే నిర్మించారు. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలనుకున్నా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు టీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్ వేదికగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో, ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఇక 2004లో యుపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో...

కోచ్ అడిగితే.. వ్యాగన్ ఇచ్చిన మోదీ..

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన గత కేంద్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ 2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసి.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వలేమని చెప్పిందని పరోక్షంగా అంగీకరించిందని అందరూ భావించారు. అయితే 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూరులో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఒత్తిడి పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేయటంపై ఓరుగల్లువాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వ్యాగన్‌నే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

- దేవులపల్లి రాఘవేందర్, రాష్ట్ర రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్



కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 20ఎకరాల్లో కూడా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చు. ఈ కోచ్‌ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకు వచ్చే ఆదాయంలో అధిక ఆదాయం కాజీపేట నుంచే వస్తుంది. రైల్వే డివిజన్ ఏర్పాటుకు కాజీపేటకు అన్ని అర్హతలున్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

బీజేపీ ఎంపీల అసమర్థత వల్లే..

- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



విభజన చట్టాలను నెరవేరుస్తారన్న ఆకాంక్షతోనే ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారు. కానీ ఆ ఎంపీల అసమర్థత మూలంగానే తెలంగాణలో కీలకమైన కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రావటం లేదు. ఏపీ, బిహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కేంద్రం తెలంగాణకు ఇవ్వటం లేదు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుంది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తీరుతాం. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్‌ను తీసుకొస్తాం.



నిర్మాణంలో ఉన్న వ్యాగన్ ఫ్యాక్టరీ

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ జిల్లా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలకు ఆదేశం



ఆసుపత్రిలో ఓపీ విభాగం వద్ద రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని జనగామ జిల్లా ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ సేవలపై ఆరా తీశారు. జనరల్ వార్డుల్లో రోగులతో మాట్లాడి వైద్యం ఎలా అందుతోందని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని హెచ్‌ఐవీ విభాగాన్ని పరిశీలించి హెచ్‌ఐవీపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఆసుపత్రిలో, ఎంసీహెచ్‌లో రక్త నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్స పొందిన రోగుల పర్యవేక్షణ విషయంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ రోగులను చికిత్స అనంతరం ఇంటి వద్ద దించిరావాల్సిన బాధ్యత ఆరోగ్య మిత్రలపై ఉందన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. కొంత మంది వైద్యులు, సిబ్బంది వారం రోజులుగా బయో మెట్రిక్ ద్వారా అటెండెన్స్ వేయకపోవడంపై గల కారణాలను ఆయన ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన వైద్యుల బయో మెట్రిక్ రిజిస్టర్ కాకపోవడంతో అటెండెన్స్ నమోదు కాలేదని సమాధానమిచ్చారు. కాగా.. కొంతమంది ఉద్దేశపూర్వకంగా విధులకు హాజరు కావడం లేదని, అలాంటి వారిని గుర్తించి మెమో జారీ చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కేశవనాథ్, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ : కలెక్టర్

అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ జాబితాలో పేర్లు రాని రైతులు స్థానికంగా ఉండే ఏఈవోలు, ఏవో, బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. రుణమాఫీ ప్రక్రియ సంబంధించిన ఫిర్యాదులు ఇచ్చేందుకు రైతులు 7569186567 నంబరులో సంప్రదించాలన్నారు. జిల్లాలో 'టు బి ప్రాసెస్డ్, ఇన్‌వ్యాలిడ్ ఆధార్, నో డేటా ఫౌండ్, ఆధార్‌లో పేరు, బ్యాంకులో పేరు తప్పుగా ఉండడం, కుటుంబ సభ్యుల నిర్ధారణ, బ్యాంకులో సాంకేతిక సమస్యలు, రైతు మరణించడం, ఆధార్ నంబర్ తప్పుగా ఉండడం, పట్టాదారు పాస్ పుస్తకాలు లేని వారు వంటి కారణాల వల్ల రుణమాఫీ జరగలేదని గుర్తించామన్నారు. వివిధ కారణాలతో రుణమాఫీ పొందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌బుక్ జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో ఏఈవోలు, ఏవోలను సంప్రదించాలని సూచించారు. ఆధార్‌కార్డులో ఒక రకంగా, బ్యాంకులో ఒక రకంగా పేరు ఉంటే బ్యాంకులో సరిచేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు లేని వారికి సైతం రుణమాఫీ వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డు లేని వారి వద్దకు అధికారులే నేరుగా వచ్చి గ్రామ కమిటీ ద్వారా కుటుంబ నిర్ధారణ చేస్తారని, ఆ తర్వాత రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. అధికారులు గ్రామానికి వచ్చే ముందు సమాచారం ఇస్తారన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన డీఎం

జఫర్‌గడ్, ఆగస్టు 1 : హనుమకొండ నుంచి జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామానికి నూతనంగా ఆర్టీసీ సంస్థ బస్సు సర్వీసును ప్రారంభించింది. తమ్మడపల్లి(జి)కి వచ్చిన బస్సును గ్రామస్తులు గురువారం పూలు, తోరణాలతో అలంకరించి పూజలు జరిపారు. ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ మోహన్‌రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, స్థానిక మార్కెట్ కమిటీమాజీ చైర్మన్ అన్నం బ్రహ్మరెడ్డి, మాజీ సర్పంచ్‌లు అన్నెపు పద్మ అశోక్, సిహెచ్. కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ చిలువేరు శివయ్య, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గ, మండల, జిల్లా కేంద్రాలకు బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకున్నారు. హన్మకొండ డిపోకు చెందిన నూతన బస్సు సర్వీసు ఉదయం-మధ్యాహ్నం రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున హనుమకొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, తాండార్‌పల్లి, జఫర్‌గడ్ మండలం తీగారం, సూరారం మీదుగా తమ్మడపల్లి(జి) గ్రామం నుంచి పాలకుర్తి వరకు బస్సు నడుస్తుందని డిపో మేనేజర్ మోహన్‌రావు తెలిపారు.. తిరిగి ఇదే మార్గం గుండా బస్సు హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య భావోద్వేగం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 1: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం చరిత్రత్మకమంటూ మాజీ ఎమ్మెల్యే రాజయ్య డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడిపెట్టిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు తీర్పు పట్ల డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ చిత్రపటానికి రాజయ్య క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు తెలుగు రాష్ట్రాలకే కాకుండా యావత్ దేశంలోని 28 రాష్ట్రాలకు మేలుచేసే అంశమన్నారు. వర్గీకరణతో మాదిగలకు, 59 మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మాదిగ జాతి బిడ్డల పోరాట ఫలితమే ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ తీర్పు అని తెలిపారు. తాను మాదిగ బిడ్డలు చెక్కిన శిల్పాన్ని అని తెలిపారు. 1994-95 నుంచి మాదిగల హక్కులను కాపాడడానికి దండోరా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించానని తెలిపారు. దండోరా ఉద్యమమే తనను రాజకీయ నాయకుడిని చేసిందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన మాదిగ బిడ్డలకు పాదాభివందనాలు అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు కనకం గణేష్, అనంతపురం కమలేష్, తాటికొండ సురేష్, డాక్టర్ కుమార్, చింత శ్రీనివాస్, చాడ ఏలియా, గాదె శ్రీధర్, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేషం, మాతంగి దేవయ్య, చందు, లోకేష్, సలీం, అకారపు అశోక్, గాదె చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం



మంత్రి రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని సీఎం చాంబ ర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఎంకు స్వీటు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం జనగామ చౌరస్తాలో నిరసన చేపట్టారు. నిరసన ర్యాలీ చేపట్టి బీఆర్ఎస్ శ్రేణులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా రాజకీయంలో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న మహిళా సభ్యులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని మహిళలందరినీ నొప్పించాయన్నారు. అహంకారంతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలందరూ ఖండించాలన్నారు. కార్య క్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బండ యాదగిరిరెడ్డి, బొల్లం శారద, అనిత, మామిడాల రాజు, వంగ ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నిరసన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



జనగామలో మొక్కను నాటి నీరు పోస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని బతుకమ్మకుంటలో గురువారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కల సంరక్షణ తీసుకోవాలన్నారు. బతుకమ్మ కుంటను మరింత ఆహ్లాదంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎంబీబీఎస్ పరీక్షలు

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జనగామ మండలం చంపక్‌హిల్స్‌లోని మెడికల్ కాలేజీలో గురువారం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం బయో కెమిస్ట్ సబ్జెక్ట్ పరీక్ష జరిగింది. బయో కెమిస్ట్, అనాటమీ, ఫిజియాలజీకి సంబంధించి ఆగస్టు 1 నుంచి ఆగస్టు 12 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నాం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని మెడి కల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 100 మందికి 100 మంది విద్యా ర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షలను నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి వచ్చిన అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

5వ తేదీ నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కోసం మండలాలు, గ్రామాల వారీగా టీములను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానా లు చేయాలన్నారు. 5న పరిశుభ్రతపై ర్యాలీలు, సమావేశాలు, పాఠశాలల్లో విద్యార్థులకు పచ్చదనం పెంపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. పిచ్చిమొక్కలను తొలగించి గోడలకు పెయింటి ంగులు వేయించాలన్నారు. 6న మొక్కల సంరక్షణకు సంబంధించిన ప్రణాళికలు రూపొంది ంచాలని సూచించారు. 7న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 8న వీధి కుక్కల ముప్పు నివారణకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అవగాహన కల్పించాలన్నారు. 9న వన మహోత్సవంలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్క లు నాటాలని, విలేజీ టూర్ కింద విద్యార్థులతో గ్రామాలను సందర్శించి మొక్కలు నాటే కార్యక్రమ ంలో భాగస్వాములను చేయాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ అధికారి కేఆర్ లత బదిలీ

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి కేఆర్ లత బదిలీ అయ్యారు. 2016 అక్టోబరు 11న జిల్లాల ఏర్పాటు సమయంలో ఆమె జనగామ జిల్లా ఉద్యానవన శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. సుమారు 8 ఏళ్ల పాటు సుదీర్ఘంగా జనగామ జిల్లాలో ఆమె పనిచేశారు. కేఆర్ లత జనగామ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో హైదరాబాద్‌లోని కమిషనర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న బి.శ్రీధర్ రావు జనగామకు బదిలీపై రానున్నారు.

కాగా.. కేఆర్ లత బదిలీ కావడంతో జిల్లాలోని ఉద్యానవన శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆమెను జిల్లా కార్యాలయంలో గురువారం సన్మానించారు.

ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేస్తూ గురువారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐలు

ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథ్‌పల్లి, ఇ.శ్రీనివాస్ రఘునాథ్‌పల్లి నుంచి కమిషనరేట్, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు మల్టీజోన్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్.

ఎస్ఐలు వీరే..

బండి శ్రావణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘనపూర్, సీహెచ్.రాజు లింగాలఘనపూర్ నుంచి ఇంతెజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జాఫర్‌గడ్, ఎ.సురేష్ వీఆర్ నుంచి వేలేర్, డి.హరిత వేలేర్ నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూర్, ఎం.రాజేందర్ చిల్పూర్ నుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

డెంగీకి నిండు గర్భిణి బలి

గర్భస్థ కవల శిశువులు సహా కన్నుమూత

శాయంపేట, ఆగస్టు 1: మరో వారం పది రోజుల్లో పురుడు పోసుకుని పండంటి ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనివ్వాల్సిన ఆ తల్లిని డెంగీ జ్వరం బలితీసుకుంది. గర్భంలో ఉన్న పిల్లలు సహా తల్లి మృతి చెందిన విషాదకరమైన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్ ప్రింటర్స్ సర్వీస్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి లక్ష్మి-భిక్షపతి దంపతుల మొదటి కుమార్తె అయిన ప్రియాంకతో శ్రీకాంత్ వివాహం జరిగింది. కొద్దికాలంలోనే ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి రెండో కూతురు అయిన శిరీష(29)ను కుటుంబసభ్యులు శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో నిండు గర్భిణి అయిన శిరీష మూడు రోజుల క్రితం డెంగీ జ్వరం బారిన పడగా ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా పడిపోవడం, గురువారం ఆమె పరిస్థితి తీవ్ర విషమంగా మారడంతో కనీసం గర్భంలో ఉన్న కవల శిశువులనైనా బతికించాలని డాక్టర్లు ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. గర్భస్థ శిశువులు సహా శిరీష మృతి చెందింది. కుటుంబంలో వరుస విషాద సంఘటనలు జరగడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగారు.

బీసీల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయించాలి

కాజీపేట, ఆగస్టు 1: బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాధినేని సుధాకర్, మాచర్ల శరత్ కుమార్, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, దువ్వ కనుకరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్సపొదుతూ మృతి చెందాడు..కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కు చెందిన ఎస్‌డీ అలీ (40), ఈ నెల 25న బైక్‌పై నిట్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌డీ అలీకి తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..
ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టు చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని ఆశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త
మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

రేపు ఎస్సార్ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నామని ఎస్సార్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి సయంట్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. గత 45 ఏళ్లుగా విద్యారంగంలో ఎస్సార్ విద్యాసంస్థలు ముందున్నాయని, 2022లో ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్ ఆమోదించబడిందని గుర్తు చేశారు. 2002లో ప్రాంభంమైన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్, ఎన్‌బీఏ, డబ్ల్యుజీసీ అక్రిడిటేషన్లు సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 2023లో 98వ స్థానం సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలతో అటల్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో డిగ్రీల ప్రదానంతోపాటు గౌరవ డాక్టరేట్లు, పూర్వ విద్యార్థులకు సత్కారం, కాంక్లేవ్స్, టాసింగ్ ఆఫ్ క్యాప్స్, అధికారిక ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డాక్టర్ సుమన్‌కుమార్, డీన్లు, హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాటం ఫలించిన వేళ

» ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు

» వర్గీకరణ పోరాటానికి, నాయకత్వానికి వేదికైన ఓరుగల్లు



హనుమకొండ సిటీ, ఆగస్టు 1: మూడు దశాబ్దాల మాదిగల ఆత్మగౌరవ రక్షణ పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు చెప్పడంతో మాదిగ జాతి ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. వర్గీకరణే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకు ఓరుగల్లు నుంచే అంకుర్పారణ జరిగింది. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కమిటీ నిర్మాణం జరిగినా.. అంతకు ముందు నుంచే ఓరుగల్లులో ఎంఆర్‌పీఎస్ స్థాపనపై ఆలోచనలు, సమావేశాలు, చర్చలు జరిగాయి. ఈ మహోత్తర పోరాటానికి వ్యవస్థ నిర్మాణమే కాదు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఓరుగల్లు వాసే. పోరుగల్లు పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన లక్ష్య సాధన వైపు అడుగులు వేయగా.. ఆయన వెంట మాదిగ జాతి యావత్తు నడిచింది. పోరాట క్రమంలో అభిప్రాయభేదాలు వచ్చినా.. అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న మాదిగ సంఘాలు వేరయినా.. అందరి లక్ష్యం 'వర్గీకరణే' అన్నట్టుగా పోరు సాగింది. చివరకు గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ చరిత్రలో ఓ మహాఘట్టం ఆవిష్కృతమైంది. విద్య, ఉద్యోగాల్లో మాదిగ జాతి అభ్యర్థులకు సముచిత న్యాయం దక్కే అవకాశం వచ్చింది.

పోరాటంలో ఓరుగల్లుదే కీలక పాత్ర

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో ఓరు గల్లు కీలకపాత్ర పోషించింది. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ అడుగు ముందుకేశారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసిన అదే రోజున గ్రామ కమిటీని నియమించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒంగోలు, హైదరబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలు వర్గీకరణ పోరాటానికి బలమైన పునాదులు వేశాయి. అనంతరం 1998లో జస్టిస్ రాంచంద్రరాజు కమిషన్ ఏర్పటవగా.. వర్గీకరణకు ఆ కమిషన్ సిఫార్సు చేసింది. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్ర బాబు వర్గీకరణకు ఓకే చెప్పడంతో 2004 వరకు 22వేల ఉద్యోగాలు మాదిగ సామాజిక అభ్యర్థులకు లభించాయి. కానీ పార్లమెం ట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా వర్గీకరణ అమలు చేయడమేంటన్న వివాదాలు తలెత్తడంతో వర్గీకరణకు ఆటంకంఏర్పడింది. దీనిపై మళ్లీ ఉద్యమం రగిలింది. వైయస్ ప్రభుత్వ హయంలో 2004లోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఛలో అసెంబ్లీ పోరాటం చేయడంతో నాటి వైయస్ ప్రభుత్వం వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2006లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఉషామెహ కమిషన్ వేయగా 2008లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిషన్ బృందం వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని నివేదిక ఇచ్చింది. ఆ తరువాత తెలంగాణ మలి దశ ఉద్యమం ఆరంభం కావడంతో వర్గీకరణ బిల్లు తెరమరుగైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ వర్గీకరణ పోరాటం ఊపందుకుంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పును ఇవ్వడంతో మూడు దశాబ్దాల పోరా టానికి విజయంతో ముగింపు వచ్చింది.



జిల్లాలో జరిగిన ముఖ్య ఘట్టాలు..

2006లో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగం గా కాజీపేటలో అర్ధరాత్రి పుష్‌పుల్ రైలుకు నిప్పంటించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక అదే ఏడాది హైదరాబా ద్‌లో మందకృష్ణ చేపట్టిన ఆమరణ దీక్షలో వరంగల్ జిల్లా నుంచే అత్యధికంగా మేధావులు, యువకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన

దేవరుప్పుల, ఆగస్టు 1 : మహిళా శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి అసెం బ్లీలో చేసిన నీచమైన వ్యాఖ్యలకు నిరసనగా దేవరుప్పుల మండల కేంద్రంలోని చౌరస్తాలో జనగామ-సూర్యాపేట రహదారిపై ఆయన దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ శ్రేణులు దహనం చేశారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, దేవరుప్పుల మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, నాయకులు బస్వ మల్లేశం, కోతి ప్రవీణ్, కొల్లూరు సోమయ్య, కాశీం, తిరుమలేశ్, గండిపెల్లి యాకయ్య, కూతాటి నర్సింహులు, జోగు సోమనర్సయ్య, యాఖూబ్‌పాషా పాల్గొన్నారు.

● పాలకుర్తి : రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను కించపరిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, పాము శ్రీనివాస్, అబ్బాస్‌అలీచ గణేష్, కారుపోతుల వేణు, కలింగరావు తదితరలు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : అసెంబ్లీ సాక్షిగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ కోరారు. గురువారం డివిజన్ కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద అసెంబ్లీలో బీఆర్‌ఎస్ మహిళ ఎమ్మెల్యేల పైన చేసిన సీఎం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేసి సీఎంకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. పాల్గొన్నారు.


దేవరుప్పులలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

● కొడకండ్ల : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజీ ఆధ్వర్య ంలో గురువారం తీవ్ర నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పేరం రాము, డి.వెంకటేశ్వర్‌రావు, జె.విజయమ్మ, చెంచు రాజిరెడ్డి, ప్రేమ్‌కుమార్, యాదగిరి, డి.వెంకన్న పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : ముఖ్యమంత్రి మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా మాట్లాడాడంటూ గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులు మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తనస్థాయికి తగ్గట్టు వ్యవహరించటలేదన్నారు. ఆందోళనలో పాల్గొన్న వారిని ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు నాయకులు కల్లూరి అనిల్‌రెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, గంధమాల నరేందర్, ముసిని రాజుగౌడ్, కాపర్తి హరిప్రసాద్, జూకంటి కిష్టయ్య, భానుచందర్, అజీం, గోపి, వినోద్ తదితరులున్నారు.

● నర్మెట : ఆడబిడ్డలపై సీఎం రేవంత్‌రెడ్డి నీచమైన వ్యాఖ్యలు చేశాడని నిరసిస్తూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ ఆధ్వర్యంలో గురువారం నర్మెట మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనంచేశారు. చింతకింది సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నర్మెటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జిల్లా సర్వే అధికారి కొండల్‌రెడ్డి బదిలీ

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా సర్వే, భూరికార్డుల శాఖ జిల్లా అధికారి ఎం.కొండల్‌రెడ్డి బదిలీ అయ్యారు. 2016 అక్టోబరు 10న జిల్లా ఏర్పాటు సమయంలో జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కొండల్‌రెడ్డి దాదాపు 8 ఏళ్లపాటు జనగామలో బాధ్యత లు నిర్వర్తించారు. కొండల్‌రెడ్డి జనగామ నుంచి తార్నాకలోని ఎస్సారెస్పీ భూసేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా అదే కార్యాలయంలో పనిచే స్తున్న వై.మన్యంకొండ జనగామ జిల్లా సర్వే, భూరి కార్డుల శాఖ అధికారిగా బదిలీపై రానున్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహకు 5కే రన్

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దే శంతో 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జనగా మ ఏసీపీ పార్థసారధి తెలిపారు. 5కే రన్ రిజిస్ట్రేషన్ లిం క్‌ను స్థానికంగా గురువారం విడుదల చేశారు. ప్రతీ ఒక్కరు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమజా నికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా ఆగస్టు 6న ఉదయం 6 గంటలకు జనగామ చౌరస్తా నుంచి యశ్వంతాపూర్ ఎల్లమ్మ గుడి మీదుగా తిరిగి జనగామ చౌరస్తా వరకు 5కే రన్ నిర్వహిస్తామన్నారు. పోటీలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు స్త్రీలు, ముగ్గురు పురుషులకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి, ఆగస్టు 1: మండలంలోని కుసుంబాయితండాకు చెందిన కొర్ర ఉమల్ (36) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా , చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి భార్య కొర్ర బంగారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

జఫర్‌గడ్ తహసీల్దార్‌గా శంకరయ్య

జఫర్‌గడ్, ఆగస్టు 1 : జఫర్‌గడ్ నూతన తహసిల్దార్‌గా డి.శంకరయ్య నియమితుల య్యారు. ఇక్కడ పని చేసిన అంబటి ఆంజనేయులు ఇటీవల నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో తహసిల్దార్ హోదాలో పని చేస్తున్న శంకరయ్య జఫర్‌గడ్ తహసిల్దార్‌గా బదిలీపై వచ్చారు. గురువారం పదవీ బాధ్యతలు చేపట్టిన శంకరయ్యను మాజీ వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా మల్లికార్జున్

బచ్చన్నపేట, ఆగస్టు 1: లింగాలఘన్‌పూర్ నుంచి బదిలీపై వచ్చిన మండల పంచాయతీ అధికారి మల్లిఖార్జున్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రఘురామకృష్ణ లింగాల్‌ఘన్‌పూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఎంపీడీవోను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కొడకండ్ల ఆగస్టు 1: వండలకేంద్రానికి చెందిన బొల్లి నాగరాజుకు చెందిన ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నాగరాజుకు చెందిన వ్యవసాయభూమిలో వారి బోర్ మోటార్‌కు చెందిన సర్వీస్ వైర్ భూమిపై పరిచి ఉండగా కొంతమేరకు రాగితీగ బయటకు వచ్చి ఉంది. నాగరాజు కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులలో ఉండగా ఆవు మేత మేస్తూ వచ్చి తీగ బయటకు వచ్చిన దగ్గరే తగలడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిం ది. రెండు నెలల క్రితం రూ. 70 వేలు పెట్టి కొన్నామని పాలు ఇస్తూ, నాగలి కూడా దున్నుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు చోరీ

లింగాలఘణపురం, ఆగస్టు1: మండలంలోని నెల్లుట్లలో బుధవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు రెండు 25 కేవీఏ ట్రాన్స్‌పార్మర్లకు చెందిన కాపర్‌వైరును చోరీ చేశారు. ఏఈ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లుట్ల శివారులోని వ్యవసాయ విద్యుత్ సరఫరాకు చెందిన వేర్వేరు ప్రాంతాల్లోని రెండు ట్రాన్స్‌పార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని సుమారు రూ. 30వేల విలువైన కాపర్ వైరును చోరీ చేశారని తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

లింగాలఘణపురం, ఆగస్టు1: ప్రజ్ఞవికాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఈనెల 2న జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను లింగాలఘణపురం మండలం వనపర్తి వీవీఆర్ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రజ్ఞవికాస్ టీం జిల్లా కోఆర్డినేటర్ పప్పు వెంకట్‌రెడ్డి తెలిపారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రజ్ఞవికాస్ ద్వారా మాతృభూమికి కృతజ్ఞత, సీమ సంరక్షన దళాలకు కృతజ్ఞత, స్వాతంత్ర్య సమరయోధులకు కృతజ్ఞత అనే మూడు అంశాల్లో ఏదో ఒకటిని ఎంపిక చేసుకుని వ్యాసరచన చేయాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి జీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతులు ఇస్తామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బచ్చన్నపేట, ఆగస్టు 1: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ శివారులో గంజాయిని విక్రయిస్తున్న బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కొల్లూరి సంజీవ్‌కుమార్‌ను గురువారం అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామాల్లోకి గంజాయి వచ్చి చేరుతున్న వైనంపై ఇటీవల పోలీసులు దృష్టి సారించారు. గంజాయికి బానిసలైన యువకుల ద్వారా ఏజంట్ల సమాచారాన్న పోలీసులు సేకరించి, వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పోరాట యోధుడు కృష్ణమూర్తి వర్ధంతి

పాలకుర్తి, ఆగస్టు 1 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి 18 వ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భ ంగా సీపీఎం జిల్లా నాయకుడు సోమ సత్యం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మానంపల్లి నాగయ్య తదితరులు ఉన్నారు.

● దేవరుప్పుల : తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వీరుడు కాసం కృష్ణమూర్తి ఆశయ సాధనకు కృషి చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. గురువారం మండలంలోని నీర్మాల గ్రామంలో కృష్ణమూర్తి 18వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్మారకస్థూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం జెండాను జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆవిష్కరించారు కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్;నాయకులు పల్లా కృష్ణారెడ్డి, చుంచు యుగేందర్, బూడిద గోపి, జోగు ప్రకాష్ పాల్గొన్నారు.

సీజేఐటీలో ఉద్యోగ నైపుణ్య సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభిజిత్

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల(సీజేఐటీ)లో రెండు రోజుల పాటు ఉద్యోగ నైపుణ్య సదస్సు నిర్వహించినట్లు కాలేజీ డైరెక్టర్ ఫాదర్ విజయపాల్‌రెడ్డి తెలిపారు. జ్ఞానం, నైపుణ్యం పెంచుకొని భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించడం ఎలా అన్న అంశంపై స్కిలెన్సియో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నైపుణ్య సదస్సును బుధ, గురువారాల్లో నిర్వహించామన్నారు. కాలేజీకి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థులకు స్కిలెన్సియో కంపెనీ సీఈవో అభిజిత్, ట్రైనర్లు సతీశ్, శ్రీధర్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. బీటెక్ పూర్తి చేసిన అనంతరం వివిధ కంపెనీలలో ఉద్యోగం సాధించేందుకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, జావా ఫుల్ స్టాక్ ప్రోగ్రామింగ్, గ్రూప్ డిస్కషన్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ విభాగాల నుంచి 240 మంది విద్యార్థులు ఈ నైపుణ్య సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.

మూగజీవిపై అమానుషం

గేదె తోకను నరికిన గుర్తు తెలియని వ్యక్తులు

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మూగజీవిపై గుర్తు తెలియని వ్యక్తులు అమానుషంగా ప్రవర్తించారు. తమ చేను మేసిందనో, తమ పొలంలోకి వచ్చిందనో.. మాటలు రాని ఆ మూగజీవిపై కర్కశంగా ప్రవర్తించారు. జనగామ మండలం మరిగడికి చెందిన పిట్టల ఉపేందర్‌కు చెందిన గేదె తోకను గుర్తు తెలియని బుధవారం రాత్రి వ్యక్తులు నరికివేశారు. గురువారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూసే సరికి తోక నరకడంతో గేదె బాధతో విలవిలాడుతూ కనిపించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపేందర్ తెలిపాడు. మూగజీవి పట్ల అమానుషంగా ప్రవర్తించిన వ్యక్తిని గుర్తించి శిక్షించాలని రైతు కోరాడు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 1: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వి.కొంరెల్లి, శ్రీరంగాచారిలను గురువారం స్టేషన్ ఘన్‌పూర్ పీఎస్ లెవల్ కాంప్లెక్స్ సమావేశం, శివునిపల్లి సోషల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అనంతరం ఘనంగా సన్మానించారు. జూలై నెలలో రిటైర్ అయిన కొంరెల్లి, ఈ నెలలో రిటైర్ అవుతున్న శ్రీ రంగాచారి సేవలు మరువలేనివని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జి.కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కె.రమేశ్, ఎం.సంపత్, పీఎస్ హెచ్‌ఎంలు సదామోహన్, యాద శ్రీనివాస్, ఆర్‌పీలు కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, బి.రాజేందర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డిప్యూటీ సీహెచ్‌వో

స్టేషన్ ఘన్‌పూర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆఫీసులో డిప్యూటీ సీహెచ్‌ఓగా విధుల్లో చేరిన చింత వెంకటస్వామిని పలువురు అభినందించారు. శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్‌ను ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్, డీపీఎంఓ మూర్తి, డేవిడ్, శేషయ్య, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 1: హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం జరిగిన సెలక్షన్స్‌లో మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన కత్తుల రమేష్-రజిత దంపతుల కుమార్తె కత్తు రక్షిత జనగామ జిల్లా నుంచి స్పోర్ట్స్‌స్కూల్‌కు ఎంపికైంది. ఎస్ఎంసీ చైర్మన్ వారాల రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న రక్షిత సెలక్షన్స్‌లో పాల్గొని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైందన్నారు. జిల్లా నుంచి ఒకే ఒక విద్యార్థిని ఇప్పగూడెం నుంచి ఎంపిక కావడం హర్షనీయమన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 1: భారత తపాలశాఖ ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రవి తెలిపారు. గురువారం మండలంలోని తాటికొండ గ్రామంలో నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలకు, విద్యార్థులకు, చిన్నారులకు తపాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతీ ఒక్కరు తపాలశాఖ అందిస్తున్న భీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ అధికారులు రమేష్, దినకరణ్ పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

చిలుపూర్, ఆగస్టు 1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్తాత్మకంగా చేపడుతున్న రైతు రుణమాఫీ అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న ఇండియన్ (అలహాబాద్) బ్యాంక్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధికారులను డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మల్కాపూర్‌లో ఇండియన్ బ్యాంక్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు సాదం రమేష్, రాపర్తి సోమయ్య వేర్వేరుగా మాట్లాడారు. రైతులను ఇబ్బందులను గురిచేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలన్నారు. బోళ్ళ రాజ్‌కుమార్, ఆవుల ప్రభాకర్, శివరాత్రి సాలయ్య, ఆవుల లింగయ్య, కాసాని లింగయ్య, సాదం రామరాజు, బుచ్చయ్య, వెంకటయ్య, కొమురయ్య, కట్టయ్య, రాజు, వెంకన్న, మాచెర్ల కనకయ్య పాల్గొన్నారు.

భూకబ్జాకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలి

చిలుపూర్, ఆగస్టు 1 : తమ భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ... మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన గౌలికార్ హంసాబాయి అనే మహిళా రైతు తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో టెంటు వేసుకుని ఫ్లెక్సీతో నిరసన చేపట్టారు. గురువారం బాధిత రైతు హంసాబాయి మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ పరిధిలోని 287 ఏ, 312 ఈ, లలో 2. 2ఎకరాల సాగుభూమి తమకు ఉండగా, గత ప్రభు త్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్కు సైతం ఉందన్నారు. కాగా, గత కొన్నేళ్ళుగా గ్రామానికి ఓ వ్యక్తి ఇట్టి భూమి ఆయ నకే చెందుతుందని, కొంతమంది గ్రామస్థుల అండదండలతో తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ సైతం వచ్చిందన్నారు. స్థానిక పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోవడం వల్లే దిక్కుతోచని స్థితిలో టెంటును వేయడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు గౌలికార్ బీము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 1 నుంచి 7 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన గురువారం జిల్లాకేంద్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. జిల్లాకేంద్రంలోని సత్రంకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత తల్లి పాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా ప్రమీల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలు మండలంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించే విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో ' అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటుదాం' అనే నినాదంతో ముర్రుపాలతో పాటు తల్లిపాల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తల్లులకు వివరించారు.

● లింగాలఘణపురం, ఆధునికత ఎన్ని పరుగులు తీసినా.. శాస్త్రీయత ఎంత పురోగమిస్తున్నా.. ఆఖరికి అమ్మపాలే బిడ్డకు అమృతమని జిల్లా సంక్షేమాధికారి జెట్టి జయంతి అన్నారు. గురువారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాలకు డిడబ్ల్యువో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సూపర్‌వైజర్ పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. లింగాలఘణపురం మండలం మాణిక్యాపురం, సిరిపురం గ్రామాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లి పాలే శ్రేయస్కరమని ప్రతి తల్లి గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్ ఎం.రాణి కోరారు. గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ ముదిరాజ్ వాడలో తల్లులు, గర్భినులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వీఓఏ భాగ్యలక్ష్మి, పుష్పలీల, చంద్రు, కుమార్, గట్టమ్మ, పి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం

జనగామ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ జిలాకేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కొయ్యడ మల్లేశ్ మాదిగ, రాగళ్ల ఉపేందర్‌మాదిగ, గద్దల కిశోర్ మాదిగ మాట్లాడారు. అనంతరం మాదిగ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజమౌళి, సుగుణాక ర్‌రాజు, కృష్ణ, నాయకులు పైస రాజశేఖర్ పాల్గొన్నారు.

● దేవరుప్పుల : ఎస్సీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంతో మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని చౌరస్తాలో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహా, నాయకులు కొంగ రాములు, బట్ట యాదగిరి, జోగు వెంకి ఎల్లయ్య, ఉప్పుల రవి, జోగు సుదర్శన్, పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో మాదిగలు చేస్తున్న 30 ఏళ్ల పోరాటం ఎట్టకేలకు ఫలించిందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణ అంశంపై తీర్పు వెలువడిన వెంటనే లింగాలఘణపురం మండల వ్యాప్తంగా మాదిగలు ఉపకులాల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంఎస్‌పీ జిల్లా అధికారప్రతినిధి సందెన రవీందర్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నర్సింగ రవి, గద్దం ఆంజనేయులు, సోమరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు ఎస్సీ వర్గీకరణ కోసం గత 30ఏళ్లుగా పోరాటం చేస్తున్న మాదిగల పోరాటానికి దక్కిన గౌరవమని ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ ఏలియా తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్, ఎమ్మెల్సీ నాయకుల ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పించి అనంతరం జాతీయ రహదారి పై బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. నాయకులు గాదె శ్రీధర్, గోవిందు, నలిమెల నాగరాజు, అరుణ్, శ్రీనివాస్, గుర్రం అశోక్, మంద శ్రీనివాస్, గుర్రం నవీన్, నలిమెల ఏలియా, వసంత్ పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకమని దళిత సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ దళిత నాయకులు ఎడ్ల వెంకటస్వామి, మారెపల్లి ప్రభాకర్ మాట్లాడారు. దళిత సంఘాల నేతలు రాజెందర్, మొగిలి, తాటికాయల ఎల్లయ్య, పెండ్లి స్వామి, తాటికాయల చేతన్, నాగరాజు, తాటికాయల యాకయ్య, నర్సింగం, యాదగిరి, అబ్బిడి రత్నాకర్‌రెడ్డి, సింగారపు వెంకట్రాంనర్సయ్య, నర్సింగం, సింహాద్రి, సంగ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● పాలకుర్తి : ఏబీసీడీ వర్గీకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని సుప్రీంకోర్టు తీర్పు నివ్వడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఎమార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చెరిపల్లి యాదగిరిస్వామి, జలగం నరేష్, రాంచంద్రుడు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించిందని, వర్గీకరణతో మాదిగలు, ఉపకులాలకు భవిష్యత్తు ఉంటుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద బాణసం చాలు పేల్చి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అల్వాల నర్సింగరావు, ఎల్లయ్య, పాకాల కుమారస్వామి, అంజయ్య, ఇస్తారి, రాందాస్, కర్ణాకర్, రవి పాల్గొన్నారు.

● చిలుపూర్, ఆగస్టు: ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం అనుకూలంగా తీర్పునివ్వడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఆరూరి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఈ మేరకు చిలుపూర్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి టపాసులు కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆరూరి శ్రీనివాస్ మాదిగ మాట్లాడారు.

● రఘునాథపల్లి : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు కొయ్యడ మల్లేష్ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కోచ్ తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

వ్యాగన్‌తో ఒనగూరేది అంతంతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

కలగానే రైల్వే డివిజన్..

దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీపంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్పుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమ వుతున్నాయి. రైల్వే విడిజన్ ఏర్పడితే పరిపాల సౌలభ్యంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని రైల్వే ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.